327068901

ప్రేమ రూపము బ్రహ్మంబు ప్రేమ మయము
ప్రేమ ప్రేమతో సంధింపనవు మగును
కాన ప్రేమను గట్టిగా కలిగియుండి
ప్రేమ చేరుడు ప్రేమ విద్యార్థులార.

విద్యార్థులారా!

భగవంతుడు ప్రేమస్వరూపుడు: 'బ్రహ్మవేదం సర్వం విశ్వం' సర్వమ్ విష్ణుమయం జగత్' జగత్తంతయు భగవత్ స్వరూపమే. ఏలా వాలా ప్రేమస్వరూపమే. ఈ ప్రపంచము. ఇట్టి అనంతమైన సర్వవ్యాపకమైన ప్రేమ తత్వాన్ని విశాలత్వాన్ని వ్యక్తమైన, సంకుచితుడైన ఈ మనుజుడు గుర్తించుకోలేక పోతున్నాడు. దేహమునకు సంబంధించిన ప్రేమ అనియు, మనస్సునకు సంబంధించిన ప్రేమ అనియు, ఆత్మకు సంబంధించిన ప్రేమ అనియు మూడు భాగములుగా విభజించుకొని మానవుడు అనుభవించుటకు ప్రయత్నిస్తున్నాడు. కనుకనే ఈ ప్రేమ తత్వము తామో రజ స్సాత్వికంగా రూపొందుతూ వస్తుందాది. జగత్తునందు కలిగే సంయోగ వియోగములు కాని సృష్టి స్థితి లయములు గాని ప్రేమపైననే ఆధారపడి వుంటున్నాయి. ప్రేమ తత్వాన్ని మనం గుర్తించుకున్నప్పుడు సంయోగ వియోగములందుగాని, సుఖ దుఃఖములయందుగాని మనం సమత్వాన్ని వహించుటకు ఎంతైనా అవకాశము వుంటుంది. శాస్త్రం తామసికమైన ప్రేమ తత్వాన్ని అధమ ప్రేమ అని వర్ణిస్తూ వచ్చింది. కేవలం తనకు, తనకు సంబంధించిన పదార్థములకు, తనకు సంబంధించిన వ్యక్తులకు మాత్రమే యిది పరిమితమై వుంటుంది. ఇది సంకుచితమైన స్వార్థప్రేమగా రూపొందుతుంది. ఇది తమోగుణ సంబంధమైన దేహ ప్రేమ. ఇంక రెండవది స్వార్థ పరార్థములకు సమన్వయమైనది. స్వార్థమును స్వప్రయోజనమును దృష్టియందుంచుకొని తమ కార్యములను నెరవేర్చుకునే నిమిత్తమై శ్రీమంతులుగాని, అధికారులుగాని ప్రేమించినట్టుగా నటించి వారి ద్వారా కార్యములను సఫలీకృతం చేసుకోటానికి పూనుకుంటారు. ఏ విధముగా అనగా అధికారుల దగ్గరికి వెళ్ళి తమ కార్యాన్ని పరిపూర్ణము గావించుకునే నిమిత్తమై వారికి మాలలు వేయటము వారి దగ్గర అణగి మణగి వుండటము, వారికి వినయ భయ విశ్వాసములు ప్రకటించటము, వారిని గౌరవించటము ఈ విధమైన నటనలచేత ప్రేమను ప్రకటిస్తూ వస్తుంటారు. ఇది మన విద్యార్థులందరికి చక్కగా అర్థమైన విషయమే. సీటు చిక్కేంత వరకు, యిక్కడ చదివేంత వరకు పిల్లలు వారి భక్తి ప్రపత్తులు ఎన్ని విధములుగానో ప్రకటిస్తూ వుంటారు. వారు మాత్రమే కాదు. వారి తల్లిదండ్రులు కూడా అంతే. సీటు యిచ్చిన తర్వాత, విద్యపూర్తి అయిన తరువాత ఈ

విద్యార్థులు ఎక్కడో వారి తల్లి తండ్రులు ఎక్కడో ఏమాత్రము కనుపించరు. ఇది ప్రత్యక్షనిదర్శనము. ఇది రెండవ విధమైన రజోగుణ ప్రేమ. తమ కార్యమును సఫలీకృతం గావించుకునే నిమిత్తమై ప్రేమను ప్రపంచమందు ప్రకటిస్తూ స్వార్థమునను భవిస్తూ ప్రాప్తమైన జగతునందు అప్రాప్తమైన తత్వమును ప్రకటితము చేస్తూ వుంటారు. యిది రజోగుణ సంబంధమైన ప్రేమ. ఇంక మూడవది. శుద్ధ సాత్వికమైన ప్రేమ. జగత్తునందు యిప్పటి పరిస్థితి లోపల యీ స్థాయిలో చాలా అరుదుగా వుంటారు. సర్వజీవుల యందు వుండేది ప్రేమ స్వరూప పరమాత్ముడే. అనే సత్యాన్ని గుర్తించి ప్రేమ లేకుండా జీవితము లేదనే సత్యాన్ని అర్థం గావించుకొని తన-పర అనే భేదము లేకుండా సర్వ భూతాంతరాత్మ అనే సత్యాన్ని వారు ప్రకటిస్తూ వస్తుంటారు. 'ఏకోవశీ సర్వభూతాంతరాత్మ' అనగా ప్రేమ స్వరూపుడైన పరమాత్ముడే సర్వభూతములయందు ఆత్మస్వరూపుడుగా వున్నాడనే సత్యాన్ని విశ్వసించి అందరియందు దైవత్వాన్ని కాంచుతూ వుంటారు. వారి దృష్టి అంతయు ఆత్మదృష్టిగా వుంటుంటాది.

ఆత్మదృష్టి కలిగిన వ్యక్తి సింహసమానుడు అన్నారు. సింహమునకెట్టి భయము వుండదు. ఏవిధమైన ఒడుదుడుకులకు అవకాశము నందించదు. నిర్భయముగా సర్వజీవులను తనకు అధీనులుగా మృగ చక్రవర్తిగా వుంటాది. ముందు వెనుక యేమాత్రం చూడదు. విచారించదు. శరీర దృష్టి కలిగిన వారి భావము గొర్రెదృష్టి వంటిది. ఇది నిరంతరము అదురు బెదురుతో కూడి వుంటుంటాది. జీవితమంతా అదురు బెదురులోనే వ్యర్థము గావించుకుంటుంది. ఆత్మదృష్టి కలిగినవాడు సింహము. మృగములన్నీ సింహము అధీనములో వుంటాయి. మనస్సు బుద్ధి చిత్తము అహంకారము యింద్రియములు యివన్నీ కూడను ఆత్మ స్వాధీనంలో వుంటాయి. ఒక్క ఆత్మను మనము అనుసరించినట్లైతే యివన్నీ సులభముగా స్వాధీనము చేసుకోవచ్చు. ప్రతి ఒక దృష్టి పారమార్థిక లక్ష్యమునందుంచుకొని వ్యావహారిక జీవితమును అనుభవించటములో దోషము లేదు. విద్యార్థులారా! లక్ష్యమును ఆత్మయందుంచుకొని దేహమునో చిత్తముల యొక్క స్వభావములను నిర్మలను రీతిగా అనుసరించటములో దోషము లేదు. ఈ లేత వయస్సునందే పవిత్రమైన దివ్య తత్వాన్ని గుర్తించుకోటం చాలా అవసరం. ఒక చిన్న ఉదాహరణము. మీరు తెల్లవారే టికెట్ తీసుకొని సకాలమునకు క్యాంటీను భోజనమునకు వెళ్ళినపుడు మీకు తప్పనిసరిగా భోజనము అందిస్తారు. అట్లు కాకుండా మొదలే నీవు టికెట్ అందుకోకుండా సకాలంలో నీవు పోయి భోజనమంటే చిక్క వచ్చు. లేక చిక్కక పోవచ్చును. సందిగ్ధవస్థలోపల వుంటాది. ఈ లేత వయస్సునందే దివ్య తత్వానికి బుక్ చేసుకోటం. ఆ టికెట్ తీసుకోవటం. చాలా అవసరం.

ఐతే మనము యీ విధమైన ఆధ్యాత్మిక తత్వము ఫలం నిమిత్తమై ఆశించరాదు. కూలి నిమిత్తమై పని చేసేవాడు కూలివాడౌతాడు గాని, యజమానుడు కాడు. కూలికోసం పని చేసే వాడు శ్రద్ధా భక్తులతో చెయ్యడు. ఆ పని కూడా అంత శుద్ధా

327068903

గా చెయ్యడు. ముందు అవని ఏమౌతుందో, ఎట్లా అవుతుందోనని విచారము కూడా చెయ్యడు. ఐదు గంటల వరకు చేస్తాడు. తన కూలి అందుకుంటాడు. వెళ్లిపోతాడు. అందువలనే అతను పరాయివాడుగా భావిస్తున్నాడు. ఇంట్లో భార్యవుంటుంది. పిల్లలుంటారు. ఇంట్లో అన్నీ చేస్తూనే వుంటారు. కాని ఏ జీతం నిమిత్తము వారు పని చెయ్యటం లేదు. సాయంకాలానికి భర్తదగ్గరకు వచ్చి ఏమండి! మీకు వంటలు చేసి పెట్టాము నాకూలియిస్తారా అని అడగదు. కాని పరిశుద్ధంగా చేస్తుంది. పవిత్రంగా చేస్తుంది. ఇంటి పదార్థములన్ని భద్రంగా చూచుకుంటుంది. ఈ విధమైన అధికారంతో పాటు ఒకవిధమైన స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తారు యింటివారు. కనుక ఫలం నిమిత్తమై భగవంతుని ప్రార్థించేవాడు కూలిమనిషి. భగవంతుడు నావాడు నాయందే వుండినటువంటివాడు అనే అధికారంగా, స్వాతంత్ర్యంగా అనుభవించటానికి ప్రయత్నించేవాడు యజమాని. మనము యజమానుడుగా మారాలి కాని సర్వెంటుగా మారకూడదు.

ఈ మార్గమునకు మూడు విధములైన సాధనలు యేర్పరుస్తూ వచ్చారు. ఒకటి మత్స్యమార్గము, రెండవది మృగ మార్గము, మూడవది కూర్మ మార్గము. ఈ మూడింటి యందు వున్న వ్యత్యాసమేమిటి? మత్స్యము జలమునందే జీవించకలదు. గట్టున జీవించలేదు. మృగము గట్టున మాత్రమే జీవించగలదు. నీటిలో నివాసము సలుపలేదు. కూర్మము నీటియందు గట్టునందు రెండింటియందు సంచరించి జీవితాన్ని గడుపుతుంది. మొదటి సాధకుడు తాను, తనవారు, తన కుటుంబము అనే పరిధియందు మాత్రము తన సాధనను తన నిశ్శబ్దమును, తన ఏకాగ్రతను అనుభవించటానికి ప్రయత్నిస్తూవుంటాడు. రెండవవాడు కేవలము ఏకాకిగా వుండి ఏకాగ్రతను పొందగలుగుతున్నాడు. జనసమూహము లోపల ఏకాగ్రతను పొందలేకపోతున్నాడు. ఒక సామాన్యమైన వ్యక్తి యింట్లో ధ్యానము చేయాలని కూర్చున్నాడు. తనకు ఎక్కువ మంది పిల్లలుండేవారు. పూజరూములో పోయ్యాడు. తలుపు వేసుకొని కూర్చున్నాడు. ఒక్కొక్క పిల్లవాడు ఒక్కొక్కతూరి వచ్చి తలుపును కొడుతున్నాడు. ఇతనికి విసుగు పుట్టింది. ఛీ! యీ యింటిలో వుండేదానికంటె అడవిలోకి పోయి తపస్సు చేయటం మంచిదనుకున్నాడు. అడవికిపోయాడు. ఒక చెట్టుక్రింద కూర్చుని ధ్యానములో నిమగ్నుడైనాడు. ఆ చెట్టుపైనున్న పక్షులు అరుస్తుంటున్నాయి. అరవటమేకాక అనేక పక్షులు చేరటం చేత నెత్తిపై రెట్టలు వేస్తున్నాయి. అక్కడ కూడా విసుగు పుట్టిందతనికి. ఇంట్లో పిల్లల గోల, అడవిలో పిట్టల గోల. ఈ గోలలు వినేదానికంటె ఆత్మహత్య చేసుకుంటే మంచిదనుకున్నాడు. ఇతడు యింట్లోగాని, బయటగాని, ఎక్కడగాని శబ్దములు వినలేక పోతున్నాడు. సర్వము భగవంతుని స్వరూపమనే సత్యమును గుర్తించుకోలేక పోతున్నాడు. ఇది రజోగుణము లక్షణము. ఇంక సాత్వికము. ఎక్కడ కూర్చున్న సరియే అతనికి ఏకాగ్రత. జనంమధ్యలో కూర్చున్నప్పటికిని ఏకాంతంగా కూర్చున్నప్పటికిని అతను అన్ని విధాలా ఏకత్వం

327068904

అనుభవిస్తున్నాడు. ఎవరైనా తన ఏకాగ్రతకు భంగం కలిగించుతే భగవంతుడే నాకు భంగం కలిగిస్తున్నాడు అని అదికూడను భగవంతుని అనుగ్రహంగా స్వీకరించే భావము.

వేదాంత విషయాన్ని చక్కగా అర్థము చేసుకొని వర్తించటము అవసరం. ఈనాడు మన ప్రామిసేలు కాని, మన వాగ్దానాలు గాని, మన వేదాంత విషయములుగాని అర్ధము చేసుకున్నట్లుగా మనం వర్తిస్తున్నామోగాని సమయ సందర్భాను సారము పురస్కరించుకొని అవి అంతర్ధాన మౌతున్నాయి. నేను ఈ విధమైన డిసిప్లిన్ నడుచుకోవాలి అని ప్రతిజ్ఞ చేసుకుంటాడు. తాను యింక యేమాత్రం మారకూడదని నిర్ణయం చేసుకుంటాడు. కాని సమయము వచ్చేటప్పటికి పూర్తి మార్పు చెందుతుంటాడు. ఒకనాడు జింకలన్నీ అడవిలో చేరి ఒక కాన్ఫరెన్సు పెట్టుకున్నాయట. మీటింగ్ ఎజండా ఏమిటి? మనకున్న శక్తి కుక్కలకేమైనా వుందా? మనం ఒక్కతూరి కాలితో కొట్టేమంటే కడుపులో పేగులన్ని కుప్పవలె రాల్తాయి. మన చిన్న కాలిలో అంత శక్తి వుంది. ఇంతటి శక్తి కుక్కలకేమైనా వుందా? మనం పరుగెత్తే వేగం కుక్కలు పరుగెత్తలేవు. వేగంలో మనం కుక్కలకంటె తక్కువ వారమా? అవసరమైస్తే మనం ఎగురుతుంటాము. కుక్కలు ఎగరలేవు. కుక్కల క్వాలిఫికేషను, మన క్వాలిఫికేషన్ తీసుకుంటే మనము చాలా గొప్పవారుగా వున్నాము. అలాంటి మనం కుక్కలకు ఎందుకు బెదరాలి? కనుక నేటినుండి కుక్కలకు ఏమాత్రం వెరువరాదు. ధైర్యంతో వాటిని ఎదుర్కొని పోరాడాలి అని నిర్ణయం చేసుకొన్నాయి. ఈ నిర్ణయం తీసుకున్న తరువాత అన్ని జింకలు లేచి నిజము నిజము అని చాలా క్లాప్స్ వేశాయి. వీటి శబ్దము విన్నదో లేదో ఎక్కడో ఒక కుక్క గట్టిగా అరిచింది. కుక్క శబ్దం విన్నదో లేదో ఈ సమావేశంలో ఒక్క జింక లేదు. పరుగెత్తి పోయాయి, మీటింగులో నిర్ణయం చేసుకున్నది ఏమిటి? అనుభవంలోకి వచ్చేటప్పటికి ఏమి చేయలేక పోయినవి పాపం.

ఇట్లే వుంటుండాది యీనాటి వేదాంతము యీనాటి నడతలు. విన్న విషయాన్ని, విన్న భావాన్ని అనుభూతిలో తెప్పించుకోటానికి తగిన ప్రయత్నం చెయ్యటి. ఈనాడు అనేక ప్రాంతములందు, అనేక స్థలములందు వేదాంతప్రబోధలు జరుగుతూనే వుంటున్నాయి. ఇంక గీతా ప్రచారములనేవి చెప్పనక్కరలేదు. ప్రతి వ్యక్తి గీతాప్రచారం చేయుటమే. గీతను సరిగా అర్థం చేసుకొని ప్రచారం చేస్తున్నారా? గీతయొక్క రహస్యమేమిటి? అని ఎవ్వరు కూడను గుర్తించిన వ్యక్తి కనుపించటంలేదు. గీతలో బోధించిన ప్రధానమైన ప్రాణసమానమైన స్థానమేమిటి? ఏపండితుడు గుర్తించటానికి ప్రయత్నించటం లేదు.

గీతా ప్రచారం చేసే ఒక గొప్ప పండితుడు లోకంలో గొప్ప పేరు పొందాడు. వారిమెప్పు వీరిమెప్పు పొందటంకంటె మహారాజు మెప్పును పొందటం గొప్పతనంగా వుంటుంటాది. గొప్ప బహుమానం వుంటుంటాది. నాయింటి పరిస్థితి హీనంగా

వుంటుందాది. రాజును పట్టాలనుకున్నాడు. వెంటపడి కుంటి నక్కను కొట్టే దానికంటె గురి తప్పినా పులిని కొట్టటం మంచిదిరా అనుకున్నాడు. చిన్న చిన్నవారినంతా అడుగున్న బదులు పులి వంటి మహారాజును పట్టుకోటం చాలా మంచిదనుకున్నాడు. మహారాజు దగ్గరకు వెళ్లాడు. ఆ మహారాజు సామాన్యుడు కాదు. అతను భగవద్గీతను పూర్తిగా అనుభవించిన వాడు, చదివిన వాడు, కంఠస్థం చేసినవాడు. కొంతవరకు అనుభవంలో తెచ్చుకొన్నవాడు. నిండుకుండ తొణకదు అన్నట్టుగా ఆ మహారాజు భగవద్గీతను గురించి ఎక్కడ కూడ ఎవరితో చెప్పలేదు. మంత్రులకు కూడ మహారాజుకు భగవద్గీత తెలుసునని తెలియదు. అలాంటి పరిస్థితిలో యీ పండితుడు శాలువా కప్పుకొని దర్బారు హాల్లోకి వెళ్లినాడు. మంత్రి వచ్చి పండితుడు తమ కోసం కాచుకున్నాడని వర్తమానం అందించాడు. రాజు వెంటనే మొదట మంత్రినే పంపించాడు. పరిస్థితి ఏమిటో; ఏ నిమిత్తమై వచ్చాడో కనుక్కొని రమ్మన్నాడు. భగవద్గీత పారాయణ చేసే నిమిత్తమై ప్రవేశించానన్నాడు పండితుడు. భగవద్గీత ప్రచార ప్రబోధల చేతనే నా జీవితమంతా జరుపుతుంటున్నాను. మా కుటుంబమంతా దాని పైనే ఆధారపడి వుంటాది వేరే వుద్యోగము గాని వేరే ఆదాయము గాని లేదు. భగవద్గీతను ప్రచారం చేయటం దానినుండి లభించిన ధనము చేత నా జీవితము సులభముగా సుఖంగా ఆనందముగా గడుపుకుంటున్నాను,

రాజు మంత్రితో చెప్పి పంపించాడు. ఆ పండితుడు యింకా భగవద్గీతను పూర్తి తెలుసుకోలేదు. తెలుసుకున్న తర్వాత రమ్మని చెప్పమన్నాడు. చూశాడు మరి. పది పదిహేను సంవత్సరముల నుండి భగవద్గీతను బోధిస్తున్నానే నాకు తెలియదని చెప్పాడు మహారాజు! ఈ మహారాజుకేమి తెలియదనుకున్నాడు. మరి ఒక పది దినములైన తరువాత తిరిగి వెళ్లాడు పండితుడు. రాజు తిరిగి యిదే జవాబిచ్చాడు. ఇంకా పూర్తి తెలుసుకోలేదు తెలుసుకొని రమ్మన్నాడు. ఈ విధంగా నాలుగైదు పర్యాయములు వెనక్కు పంపించాడు. పండితునకు చాలా కోపమొచ్చింది. చాలా నిరాశైపోయింది. నిస్పృహకు గురైపోయినాడు. ఈ లోపల విసుగు పుట్టిపోయింది. ఇంటికి పోయాడు. ఆ బుక్కు అక్కడ పారవేశాడు. చాలా నిరాశతో పండుకున్నాడు. భార్య వచ్చింది. ఏమిటండీ! మహారాజు ఏం చెప్పారు? ఇంత నిరాశకు కారణం ఏమిటి అని అనేక ప్రశ్నలు వేస్తూ వచ్చింది. ఆ కోపం చేత ఆమెను కూడా కొంచెం అరిచాడు. ఆమె మరింత పీడిస్తూ వచ్చింది. ఏం చెప్పారు మహారాజు అని అడుగుతూ వచ్చింది. చెప్పటానికి నా మనసు సరిలేదు షటప్ అన్నాడు. భర్త పరిస్థితి గుర్తించుకుంది. లోపల పోయింది. కొంచెం వుప్మా చేసుకుంది. కాఫీ తీసుకుంది. తట్టలో పెట్టుకొని వచ్చింది. కోపంగా వున్నప్పుడు మగవారిని ఏ విధంగా శాంతి చెయ్యాలో ఆడవారికే తెలుసును తప్ప అన్యులకు తెలియదు పాపం. దగ్గరకు వెళ్లింది. లేచాడు. కాఫీ త్రాగాడు. కొంచెం శాంతి కలిగింది. అప్పుడు యీమె

327068906

కూర్చుని విసనికర్ర తీసుకొని విసురుతూ ఏం చెప్పారండీ మహారాజు అని అడిగింది. ఇన్ని సంవత్సరములనుండి నేను భగవద్గీత చెప్తున్నాను. నా భగవద్గీత విన్నవారందరు ఆహా ఇంతటి గొప్ప వ్యాఖ్యానకర్త మాకు దొరకలేదని నన్ను ఎంతో వర్ణిస్తూ వచ్చారు. కట్టకడపటికి ఆ మహారాజు మంత్రితో నాకు భగవద్గీత యింకా తెలియదని చెప్పిపంపించాడు నాకు ఎంత అవమానం అన్నాడు. మన భారత దేశ ప్రభుత్వం నాకు పద్మశ్రీ అనే బిరుదు యిచ్చింది. వేదాంత రత్న అనే బిరుదు యిచ్చింది. భగవద్గీతా సామ్రాట్ అని యిచ్చింది. ఇన్ని బిరుదులు నాకిచ్చినప్పుడు ఈ మహారాజు నన్ను అవమానం చేయవచ్చునా? అదే సామాన్యమైన మానవుడైతే జుట్టుపట్టి కొట్టి వుందును. అని అనేకరకములుగా అతని ప్రభావాన్ని ప్రతాపాన్ని భార్యదగ్గర నిరూపిస్తూ వచ్చాడు.

అప్పుడు భార్య నెమ్మదిగా చెప్పింది. నిజమేనండి మహారాజు చెప్పింది చాలా సత్యము అనింది. నీవు బుద్ధివుండి మాట్లాడుతున్నావా బుద్ధి లేక మాట్లాడుతున్నావా? మహారాజు చెప్పింది ఎట్లు సత్యమౌతుంది. నాకేమి భగవద్గీత తెలియదా అని ఆమెను కూడను కోపంగా మాట్లాడుతూ వచ్చాడు. అయ్యా! మరేమైనా కోపించండి. మరేమైనా తిట్టండి. నేను మహారాజువలె సత్యాన్ని చెబుతా నన్నది. మీ భగవద్గీత పారాయణం 15 ఏండ్లనుంచి నేను చూస్తున్నాను. మీ ఉపన్యాసములంతా ఎంతో కర్ణానందంగా నేను వింటున్నాను. భగవద్గీతలోపల పరమాత్ముడేమి చెప్పాడో మీరు చూచుకున్నారా? విచారం చేశారా? యే జనాః పర్యుపాసతే తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం. ఎవరు ఏవిధంగా నన్ను కోరుకుంటారో అలాంటి వారి యోగక్షేమం నేనే చూచుకుంటానని భగవద్గీతలో చెప్పాడు అంతే కాదు లోన మోక్షాన్ని అందిస్తానని చెప్పాడు.

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః

అన్నాడు. నిజంగా ఆ చెప్పిన భగవంతుని పైనే నీకు నమ్మకముంటే నీవు మహారాజు దగ్గరకెందుకు పోవాలి.? ఆ యోగక్షేమం భగవంతుడు చూచుకోలేడా? ధనం కావలెనని మహారాజు దగ్గరకు పోయినావు. నీకేం భగవద్గీత తెలిసింది? నీవు భగవద్గీతను బోధిస్తున్నావు కాని భగవంతుని వాక్యాలపైన నీకు విశ్వాసం లేదు. నీకు భగవద్గీత పూర్తి తెలియదు అని ఆమె నిర్ణయించింది. దాంతో రాజుకు చాలా బాధ కలిగింది. యిది నిజమే.

భగవంతుడు యిట్లా చెప్పాడు అట్లా చెప్పాడు అని వర్ణిస్తున్నారేగాని ఆనాడు భగవద్గీత యొక్క ప్రచార ప్రబోధలందు భగవంతుని వాక్యాన్ని ఎవరు ఆచరిస్తున్నారు. ఇట్టి వేదాంత ప్రబోధలు అధికం కావటం చేతనే ఆధ్యాత్మికమనేది దినదినమునకు దిగజారిపోతోంది. హృదయము నుంచి వచ్చే భావములు, మాటల

327068907

నుండి వచ్చే పలుకులు చేతలలో ఆచరించాలి. ఈ మూడింటి ఏకత్వము జరిగిన తరువాత నిజమైన తత్త్వం యేర్పడుతుంది. విద్యార్థులారా! గడ్డిని పెంచుటకు మనం ఎక్కువ ప్రయత్నం చేయనక్కరలేదు. పంటను పెంచాలంటే అతిశ్రమ పడాలి. అదే విధముగనే నిష్ప్రయోజనమైన ప్రాకృతమైన విషయవాసనలు మనం అనుభవించటం గొప్పతనము కాదు. ఇది గడ్డితో సమానము. దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన భగవత్ప్రేమ తత్త్వమనే పంటను పండించుకోవాలంటే దానికే మనం శ్రమ పడాలి. దానికి ఎవ్వరూ ఏవిధమైన శ్రమను పడేది కనుపించటంలేదు. భక్తుల వలె మనకు కనుపిస్తారు. మట్టిలోనే కుమ్మరి పురుగుకు మట్టి అంటిఉందంటే అది కుమ్మరి పురుగు కాదు. కమ్మరి పురుగు. నిజముగా యీ దివ్య తత్త్వాన్ని గుర్తించుకున్న వారికి యీ విషయవాసనలపైన అంత ఒడిదుడుకులుండవు. ఏదో కాలహరణ నిమిత్తమై దీన్ని అనుభవించటానికి ప్రయత్నం చేస్తున్నాముగాని నిత్యసత్యమైన నిలయానికి యిది సరియైన రాజబాట అనే సత్యాన్ని మనం గుర్తించటంలేదు.

ప్రాకృతమైన జీవితానికి యిది వుండవలసిందే. కానీ నిత్యమైన జీవిత పరమావధికి మనం యోచించాలి. లైఫ్ అనేది కేవలం లివింగ్ కాకుండా లైఫ్ అనేది శాశ్వతమైన way of life గా చూచుకోవాలి. మీరందరు ఏ కొంచెం తెలిసినప్పటికి ఒకటి రెండైనా ఆచరణలో పెట్టి అదియే మన నిత్యజీవితమునకు ఈ సత్య మార్గమని భావించి ప్రతి దినము ఒకటి రెండు నిముషాలైనా దీనిని స్మరించటం అత్యవసరం. దినమునకు ఎన్నిగంటలో మనం స్వార్థము, స్వప్రయోజనం నిమిత్తమై వ్యర్థము చేస్తున్నాము. దినమునకు 5 నిముషాలు భగవత్తత్త్వమునకు ఉపయోగపెట్టటం లేదే. యిది ఏమి కర్మ. ఎందుకోసం యిటువంటి దుర్బుద్ధులు పుట్టటం! ఈ విధమైన దుర్బుద్ధులు మానవుని ఉన్నతికి తోసుకొనిపోవు.

అంధుడగువాడు ఎవ్వడో యవనియందు
చదువు కలిగియు చెడుక్రియలే సలుపువాడు.

అన్నారు. అంటరాని దెయ్యది? అన్నారు. అంటుగా రానిది అప్పుబాధ. ఇలాంటి బాధలు మనము నిత్యము అనుభవిస్తున్నాము. ఇంకొకరికి ఏవిధముగాను మనము పరాధీనము కాకూడదు. తన కాళ్లపై తాను నిల్చుకునే శక్తిని సంపాదించాలి. దానిని మనము భగవత్ప్రేమలోనే సాధించాలి. భగవత్ప్రేమనే లేకపోతే ప్రకృతి మనకు ఏమాత్రం వశంకాదు.

మొన్న చెప్పాను. రావణుడు భూజాతయైన సీతను మాత్రమే ఆశించి రాముని విస్మరించాడు. ప్రకృతి మాత్రం కావాలని పరమాత్మను విస్మరిస్తే యీ ప్రకృతి ఎవరి సొత్తు? నీ సొత్తా? కాదు. పరమాత్మని సొత్తు. పరమాత్మని ప్రసన్నం గావించుకుంటే ప్రకృతి మీకు వశమౌతుంది. ఈ అంతరార్థము, యీ రహస్యము ఏ మానవుడు కూడను గుర్తించటంలేదు. నా శక్తితో, నా బలముతో, నా విద్యతో నేను దీనిని సాధించానని గర్వ

327068908

పడుతూ వుంటారు మానవుడు. ఇది నీ శక్తి కాదు. కేవలము భగవత్ శక్తినే అంతర్యామిగా వుంటుండి అంతశ్శక్తిగా వుంటుండి నిన్నవిధంగా ఆడిస్తున్నది. ఒకానొక సమయంలోపల గాండీవాన్ని సాధించిన అర్జునుడు యిది అంతా నా శక్తితోనే సాధించానని, నా శక్తితోనే యుద్ధములో విజయము గాంచినాని అనేక రకములుగా గర్వించాడు. కృష్ణుడు తన దేహామును వదలిన తరువాత ద్వారక నుంచి అంతఃపుర కాంతలనందరిని తీసుకొని హస్తినాపురం వస్తుండే సమయము లోపల అర్జునుని అడవి గొల్లలు అడ్డగించారు. అతనికి గాండీవం బిగించటానికి కూడనూ చేతకాలేదు. అప్పుడు తన సత్తాన్ని గుర్తించుకున్నాడు. ఛీ! నేనెంత అవివేకుడను. నేను యింతకాలం యీ విధంగా వుండటం కృష్ణుని వరప్రసాదమే. నేను నిమిత్త మాత్రునిగా వుండినాను. 'నిమిత్తమాత్రం భవ సవ్యసాచి' అని తానే చెప్పాడు. యుద్ధములోపల నిన్ను నిమిత్తముగా పెట్టుకున్నానన్నాడు.

కనుక ప్రతి మానవుడు నిమిత్త మాత్రుడే. ఇతే తన కర్తవ్యాన్ని నిర్వర్తించుకుంటూ భగవంతునిపైన భారం వెయ్యాలి. యత్నప్రయత్నము మానవధర్మము. జయాపజయములు దైవాధీనము' అది కూడనేను నేను చేస్తున్నాను అనుకో కూడదు. నాయందున్న భగవంతుడు ఆత్మస్వరూపుడు నన్నీ విధంగా ఆడిస్తున్నాడు, చేయిస్తున్నాడు అని మాత్రమే విశ్వసించాలి. ఎక్కడ విశ్వాసమో అక్కడే ప్రేమ. ఎక్కడ ప్రేమనో అక్కడే శాంతి. ఎక్కడ శాంతియో అక్కడే సత్యము. ఎక్కడ సత్యమో అక్కడే దైవము. ఎక్కడ దైవమో అక్కడే ఆనందము. కట్టకడపటిది ఆనందము. మొదటిది విశ్వాసము. విశ్వాసము వుండినవారికే ఆనందము లభ్యమౌతుంది కాని విశ్వాసము లేనివారికి ఆనందము లభ్యము కాదు. కనుక భగవంతుని యొక్క నామస్మరణము చేస్తూ ఆత్మవిశ్వాసాన్ని నిరంతరము అభివృద్ధి గావించుకొని ప్రేమతత్వాన్ని మీ హృదయం లోపల పెంచుకోండి.